@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | హైదరాబాద్ | శుక్రవారం 12, జూలై 2024 | పేజీలు: 04

# 24వ తేదీ నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

## స్పీకర్ అధ్యక్షతన భేటీలో నిర్ణయం

- వారం రోజుల పాటు కొనసాగే అవకాశం
- ఈ నెల 25 లేదా 26న పూర్తిస్థాయి బడ్జెట్!
- 31లోపు ద్రవ్య బిల్లు ఆమోదం తప్పనిసరి
- 'రైతు భరోసా' పథకంపై శాసనసభలో చర్చ
- రాష్ట్ర చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహంపైనా!
- ఇతర బిల్లులను సభలో ప్రవేశపెట్టే చాన్స్

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 11:

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 24న ప్రారంభం కానున్నాయి. ఇవి దాదాపు వారం రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది. 25న లేదా 26న రాష్ట్ర పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టవచ్చుని సమాచారం. ఈ మేరకు సమావేశాల ప్రారంభ తేదీని ప్రభుత్వం ఖరారు చేసింది. బడ్జెట్ సమావేశాలను ఈ నెలలోపే పూర్తి చేసి, రాష్ట్ర మిగతా 2లో..



# సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్

- కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెట్టించండి
- కేంద్రమంత్రిగా ఈ అవకాశం ఉపయోగించండి
- గతంలో అనేకమార్లు విన్నవించినా ఫలించలేదు
- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు కేటీఆర్ లేఖ

2





# ఆదాయ లక్ష్యాలను చేరుకోవాలి

## గత ఆర్థిక సంవత్సరాన్ని మించి రాబడులు రాబట్టాలి..

- రాబడి కోసం ప్రతి విభాగం కఠినంగా ఉండాల్సిందే..
- ప్రధాన శాఖలన్నీ ఆదాయం వసూళ్లలో ముందుండాలి
- ఆదాయం తెచ్చే శాఖలపై సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 11:

రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టే విభాగాలన్నీ నిర్ణీత వార్షిక లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం పెరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పన్నుల ఎగవేత లేకుండా అన్ని విభాగాలు కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. వార్షిక లక్ష్యా కనుగుణంగా ప్రతి విభాగం నెలవారీ లక్ష్యాలను తయారు చేసుకోవాలని, ఎప్పటికప్పుడు సాధించిన పురోగతిని బేరీజు వేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆదాయం తెచ్చి పెట్టే వనరులపై, పన్నుల వసూళ్లపైన మిగతా 2లో..

# తెలంగాణలో టెలి కమ్యూనికేషన్స్ పెట్టుబడి

- 500 కోట్ల పెట్టుబడి పెట్టడానికి అంగీకారం
- మంత్రి శ్రీధర్ బాబుతో ప్రతినిధుల భేటీ

2



# కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్

- మరో ఆరుగురు ఎమ్మెల్యేలు 'కారు' దిగడానికి రెడీ!

2



# యూజీసీ-నెట్ ప్రశ్నపత్రం లీక్ కాలేదు

- స్క్రీన్‌షాట్‌పై తేదీ మార్చి టెలిగ్రామ్‌లో వైరల్ చేశారు
- సీబీఐ దర్యాప్తులో వెల్లడి స్క్రీన్‌షాట్‌పై త్వరలో చార్జీషీట్
- నీట్ పేపర్ లీకేజీ కేసులో కీలక నిందితుడు రాకీ అరెస్టు!
- పట్నాలో అదుపులోకి తీసుకున్న సీబీఐ

2

# హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేసింది కిషన్‌రెడ్డే..

## కేంద్ర మంత్రిగా ఒక్కపనీ చేయలేకపోయారు..



- మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 11:

పార్లమెంట్ సభ్యుడిగా.. కేంద్రమంత్రిగా ఉండి హైదరాబాద్ అభివృద్ధికి కిషన్‌రెడ్డి ఏం చేశారో చెప్పాలని తెలంగాణ మంత్రి పొన్న ప్రభాకర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేసినట్లుగా, అభివృద్ధి కుంటుపడినట్లుగా కిషన్‌రెడ్డి మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. గాంధీభవన్‌లో మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. కేంద్రం హైదరాబాద్‌ను స్మార్ట్ సిటీ చేయలేదని, అమృత్ పథకం నుంచి ఒక్క రూపాయి ఇవ్వలేదని మండిపడ్డారు. జీహెచ్‌ఎంసీ మిగతా 2లో..





# బీఆర్ఎస్‌కు గట్టి షాక్

- రేపు కాంగ్రెస్‌లోకి మరో ఎమ్మెల్యే!

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 11:

తెలంగాణలో బీఆర్ఎస్‌కు కష్టకాలం నడుస్తోంది. ఒక్కొక్కరుగా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు పార్టీని వీడుతూ కాంగ్రెస్ పార్టీలోకి జంప్ అవుతున్నారు. తాజాగా మిగతా 2లో..

# రైతుల అభిప్రాయాల మేరకు రైతుభరోసా

## పకడ్బందీగా పథకం అమలుకు చర్యలు

- సలహాలను సేకరించిన కేబినెట్ సబ్ కమిటీ
- ఉమ్మడి ఆదిలాబాద్‌లో పర్యటించిన మంత్రులు
- నిజమైన రైతులకే సహాయం అందిస్తామన్న భట్టి

2



నేటి ఫోకస్ న్యూస్
శుక్రవారం 12, జూలై 2024

# కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్

**హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 11:**

'గ్రేటర్' పాలిటిక్స్ రసవత్తరంగా మారింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ కొనసాగుతోంది. కారు దిగడానికి ఆరుగురు ఎమ్మెల్యేలు రెడీ అయ్యారు. శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యేతో చేరికలు షూరూ అయ్యింది. గ్రేటర్‌లో రోజుకో బీఆర్ఎస్ ఎమ్మెల్యే జంపింగ్‌కు స్కెచ్ సిద్ధమయ్యింది. ఇప్పటికే కార్యకర్తలతో పలువురు ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. హైదరాబాద్ శివారులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ చర్చలు పూర్తయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. రోజుకో ఎమ్మెల్యే, 20 మంది ముఖ్యనేతలు చేరికకు కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది. సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేరనున్నారు.

# బీఆర్ఎస్ గట్టి షాక్..

(మొదటి పేజీ తరువాయి..)

మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే రేపు(శుక్రవారం) హస్తం గూటికి చేరుతున్నారు. కాగా, సీఎం రేవంత్ సమక్షంలో రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ప్రకాశ్ గౌడ్‌తో పాటు మరో ఇద్దరు మున్సిపల్ చైర్మన్లు కూడా హస్తం పార్టీలో చేరుతున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవలి కాలంలో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఇక, ప్రకాశ్ గౌడ్ చేరికలో కాంగ్రెస్‌లోకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య ఎనిమిదికి చేరుకుంది.

# యూజీసీ-నెట్ ప్రశ్నపత్రం లీక్ కాలేదు..

**న్యూఢిల్లీ, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 11:**

'యూజీసీ-నెట్' ప్రశ్నపత్రం లీక్‌కు సంబంధించి సీబీఐ దర్యాప్తులో సంచలన అంశాలు వెల్లడయ్యాయి! ఆ ప్రశ్నపత్రం అసలు లీక్ కాలేదని.. టెలిగ్రామ్ చానళ్లలో వైరల్ అయిన ప్రశ్నపత్రం స్క్రీన్‌షాట్‌పై తేదీని ఓ యాప్ సాయంతో మార్చారని సీబీఐ దర్యాప్తులో తేలింది. దీని వెనుక ఒక పాఠశాల విద్యార్థి ఉన్నాడని.. ఒక యాప్ సాయంతో ఆ విద్యార్థి తయారుచేసిన స్క్రీన్ షాట్లను ఒక వ్యక్తి సర్క్యులేట్ చేశాడని వెల్లడైంది. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి అనధికారికంగా తీసుకెళ్లిన సీబీఐ.. ఆ వ్యక్తిపై చార్జిషీట్ దాఖలు చేసేందుకు, చీటింగ్ కేసు పెట్టేందుకు సిద్ధమైనట్టు సమాచారం. వర్సిటీలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలకు అర్హత సాధించడానికి, పీహెచ్‌డీల్లో ప్రవేశాలకు, జూనియర్ రిసెర్చ్ ఫెలోషిపకు అర్హత సాధించడానికి ఏటా నిర్వహించే యూజీసీ-నెట్‌ను కేంద్రం ఈ ఏడాది జూన్ 18న నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా 317 నగరాల్లో 1205 పరీక్షా కేంద్రాల్లో 11 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాశారు. ఆరోజు ఈ పరీక్షను రెండు సెషన్లలో (ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 దాకా ఒక సెషన్. మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల దాకా రెండో సెషన్) నిర్వహించారు.



# తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకై తొర్రూర్‌లో స్థలం కేటాయించాలి

**- స్థలం కేటాయింపుకై సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి**

**తొర్రూర్, (నేటి ఫోకస్ న్యూస్)-జూలై 11:**

తొర్రూరు, మండల కేంద్రంలో తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకై తొర్రూర్ పట్టణ కేంద్రంలో స్థలం కేటాయించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పున్నం సారయ్య అన్నారు. గురువారం స్థానిక పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం తొర్రూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే యశస్వి రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం తీసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి మాట్లాడుతూ, ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకై స్థలం కేటాయింపు గురించి మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయింపు జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి పున్నం సారయ్య మాట్లాడుతూ, ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో అర్జీ పెట్టుకోవడం జరిగిందని, గతంలో కూడా తహసిల్దార్ మరియు మున్సిపాలిటీ కార్యాలయంలో కూడా వినతి పత్రాలు అందజేయడం జరిగిందనీ, ఇప్పటికైనా సంబంధిత అధికారులతో మాట్లాడి స్థలం కేటాయింపు జరిగే విధంగా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు నిమ్మల సోమయ్య, టౌన్ అధ్యక్షులు చింతల మధు, ఉపాధ్యక్షులు ఓరుగంటి ప్రవీణ్, సంఘం సభ్యులు కొండ్రాతి రామకృష్ణ, మడిపెద్ది కార్తీక్, మచ్చ యాకయ్య, ఓరుగంటి సైదులు, పొడుపుగంటి సుధాకర్, పైండ్ల సంపత్, పైండ్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

**భద్రాద్రి, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 11:**

యాదాద్రి తరహాలోనే భద్రాద్రిని కూడా అద్భుత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దే సంకల్పానికి ముహూర్తం కుదరడం లేదు. మరోవైపు పోలవరంతో భద్రాద్రికి ముప్పు అన్న ఆందోళన వస్తోంది. ఈ రెడు విషయాలపై ఎలాంటి స్పందనా కానరావడం లేదు. మరోవైపు భద్రాద్రి రక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. భద్రాచలం ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్‌ప్లాన్ రూపకల్పన పై గతంలో మంత్రి తుమ్మల తదితరులతో చర్చించారు. పలుసూచనలు చేశారు. ఆలయ అధికారులు, దేవస్థానం పండితులు, స్తపతులతో కలిసి భద్రాద్రి అభివృద్ధి మాస్టర్ ప్లాన్ గురించి చర్చించారు. కానీ అవన్నీ పక్కకుపోయాయి. తుమ్మల రాజకీయంగా మళ్లీ తెరపైకి వచ్చారు. ఈ క్రమంలో ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని స్థానికులు కోరుతున్నారు. యాదాద్రిలాగా కాకాపోయిన కొంతయినా చేసి భద్రాద్రిని పునర్నించాలని కోరుతున్నారు.

# ఆదాయ లక్ష్యాలను చేరుకోవాలి



(మొదటి పేజీ తరువాయి..)

అధికారులు నిక్కచ్చిగా ఉండాలని ఆదేశించారు. సంబంధిత విభాగాన్ని అవసరమైతే పునర్ వ్యవస్థీకరించుకోవాలని, ఆదాయం రాబట్టేందుకు వీలైనన్ని సంస్కరణలు చేపట్టాలని దిశా నిర్దేశర చేశారు. ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, రవాణా విభాగాల అధికారులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు సచివాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సచివాలయంలో దాదాపు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా ఈ సమావేశంలో వివిధ అంశాలను చర్చించారు. ఎంచుకున్న వార్షిక లక్ష్యంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు వచ్చిన ఆదాయం అంత ఆశాజనకంగా లేదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఓటాన్ అకౌంట్ బ్జడెట్లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏ నెలకా నెలా మంత్లీ టా÷-గ్గ÷ట్ ను నిర్దేశిరచుకొని రాబడి సాధించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతి నెలా మొదటి వారంలో నిర్ణీత ఆదాయ లక్ష్యాలపై తాను సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. నెలవారీ సమీక్షతో పాటు ప్రతి

శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సంబంధిత శాఖల లక్ష్య సాధన పురోగతిపై సమావేశ మవుతారని చెప్పారు. ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే జీఎస్టీ ఆదాయం పెంచుకునే చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. జీఎస్టీ రాబడి పెంచేందుకు వాణిజ్య పన్నుల శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, పక్కాగా ఆడిటింగ్ చేయాలని సీఎం ఆదేశించారు. జీఎస్టీ చెల్లింపుల విషయంలో ఎవరినీ ఉపేక్షించకుండా, నిక్కచ్చిగా పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. పెట్రోలు, డీజిల్ పై వాట్ ద్వారా వచ్చే ఆదాయం తగ్గిందని, ప్రత్యామ్నాయంగా ఏవియేషన్ ఇంధనంపై ఉన్న పన్నును సవరించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను సూచించారు. ఎన్నికలప్పుడు మద్యం అమ్మకాలు, విక్రయాలు ఎక్కువగా జరిగినప్పటికీ అంతమేరకు ఆదాయం పెరగకపోవటానికి కారణాలను సీఎం ఆరా తీశారు. అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలని, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ను అరికడితే ఆదాయం పెరిగే అవకాశముందని చర్చ జరిగింది. డిస్టిలరీస్ నుంచి మద్యం అడ్డదారి పట్టకుండా నిఘా పెట్టాలని, అందుకు అవసరమైన అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సీఎం ఆదేశించారు. రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్మెంట్ ప్రాజెక్టులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని సమావేశంలో చర్చ జరిగింది. ఈ ఆరు నెలల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో అటు కమర్షియల్ నిర్మాణాలు పెరిగాయని, గృహ నిర్మాణాలు కూడా అదే వరుసలో పుంజుకుంటాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, అదే స్థాయిలో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరిగేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇసుక, ఖనిజ వనరుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను అరికట్టాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగించేందుకు పరిమిత కాలం పన్ను సబ్సిడీ అమలైందని, తిరిగి పన్ను వసూలు చేయటం ద్వారా వాహనాల అమ్మకాలపై ఏమైనా ప్రభావం పడిందా.. అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

# హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేసింది కిషన్‌రెడ్డే

(మొదటి పేజీ తరువాయి..)

ఎన్నికలు దగ్గరపడుతుండటంతోనే రాజకీయ లబ్ది కోసం హైదరాబాద్‌ను విమర్శిస్తున్నారని ఆక్షేపిం చారు. 'హైదరాబాద్.. చారిత్రక నగరం ఇస్తాంబుల్ వంటిది. చార్మినార్, గోల్కొండ వంటి ఆర్కియాలజీకి సంబంధించి ఎన్నో ఉన్నాయి. కేంద్ర పర్యాటక మంత్రిగా గత ఐదేళ్లలో కేంద్రం నుంచి హెరిటేజ్, టూరిజం, ఆర్కియాలజీ విభాగాల నుంచి హైదరాబాద్‌కు కిషన్‌రెడ్డి ఏం తెచ్చారు? ఒక్క రూపాయి అయినా తెచ్చారా? మేం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రం నుంచి నిధులు కావాలని అనేక సార్లు విజ్ఞప్తి చేశాం. హైదరాబాద్‌లో 151 ప్రాంతాల్లో వర్షం వచ్చినప్పుడు నీటి నిల్వలతో సమస్యలు ఏర్పడుతున్నాయి. రాజకీయాలకు అతీతంగా ఇంఛార్జి మంత్రిగా ఇక్కడి సమస్యలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నా. వీలైతే హైదరాబాద్ అభివృద్ధికి సహాయం చేయండి. భాజపాపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక నిధులు తీసుకురాలేకపోయిన కేటీఆర్.. ఇప్పుడు హైదరాబాద్ గురించి మాట్లాడుతున్నారు. ఆయన మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. భూకబ్జాలు, అక్రమ కట్టడాలతో హైదరాబాద్ ఇలా కావడానికి కారణం కేటీఆరే. మా ప్రభుత్వం వచ్చి ఆరు నెలలే అయింది. ఈ ఆరు నెలల్లో జీహెచ్ఎంసీ, హైదరాబాద్ కలెక్టరేట్‌లో అనేక సమీక్షలు నిర్వహిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నాం. బోనాల పండగ తర్వాత నేరుగా బస్తీల్లోకి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తాం. ఎన్నికల కోడ్ కారణంగా జాప్యం జరిగితే ఉద్యోగ నియామకాలు ఏమైయ్యాయని అడిగింది ప్రతిపక్షాలే. పక్రియ ప్రారంభమైన తర్వాత అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నదీ వీళ్లే. ఈ పదేళ్లలో టెట్, డీఎస్సీ నిర్వహించనోళ్లు ఇప్పుడు నిరుద్యోగులను ఎందుకు రెచ్చగొడుతున్నారు? నిజమైన సమస్యలు ఏమైనా ఉంటే మా దృష్టికి తీసుకురావాలని విద్యార్థి సంఘాల నాయకులను కోరుతున్నా'అని మంత్రి పొన్నం తెలిపారు.

# 24నుంచి బడ్జెట్ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి..)

వ్యయాలకు సభ అనుమతి పొందాల్సి ఉన్నందున.. గురువారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండ ప్రకాష్, అసెంబ్లీలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, రామచంద్రనాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పార్లమెంటు ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం 'ఓట్-ఆన్-అకౌంట్' బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఫిబ్రవరి 10న 'ఓట్-ఆన్-అకౌంట్' బడ్జెట్‌ను తీసుకొచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం రూ.2,75,891 కోట్లతో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, శాసన సభ అనుమతి పొందింది. ఇందులో నాలుగు నెలలు అంటే.. ఏప్రిల్, మే, జూన్, జూలై కోసం రూ.78,911 కోట్ల వ్యయానికి సభ ఆమోద ముద్ర వేసింది. ఆగస్టు 1 నుంచి మళ్లీ వ్యయాలకు చిక్కు వచ్చి పడుతుంది. ఈ దృష్ట్యా పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, శాసనసభ ఆమోదం పొందాల్సి ఉంది. అందుకే ఈ నెల 24 నుంచి సమావేశాలను ప్రారంభించాలని స్పీకర్ అధ్యక్షతన భేటీలో నిర్ణయించారు. కేంద్రం 23న లోక్‌సభలో 2024-25కు పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. అందులో గ్రాంట్లు, పన్నుల వాటా, కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) కింద వచ్చే నిధులను రాష్ట్రం పరిశీలిస్తుంది. వాటి ఆధారంగా రాష్ట్ర బడ్జెట్‌కు తుది రూపునిచ్చి అసెంబ్లీలో పెట్టనుంది. అనంతరం ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం పొందాలి. ఈ నేపథ్యంలో సమావేశాలను 24న ప్రారంభించి 28న ఆదివారం మినహా 31వ తేదీ వరకు ఏడు రోజుల పాటు కొనసాగించవచ్చని తెలుస్తోంది. ఒకవేళ పొడిగించాలనుకుంటే.. ఈ నెల 31లోపే ద్రవ్య మినిమయ బిల్లుకు సభ ఆమోదం పొందాల్సి ఉంటుంది.

## రైతుల అభిప్రాయాల మేరకు

# రైతుభరోసా..

**ఆదిలాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 11:**

క్షేత్రస్థాయిలో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి పూర్తిస్థాయి మార్గదర్శకాలతో 'రైతుభరోసా' పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఏజెన్సీ కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో రైతు భరోసా విధివిధానాల ఖరారుపై ఉమ్మడి అదిలాబాద్ జిల్లా రైతుల నుండి అభిప్రాయాలు, సలహాలను కేబినెట్ సబ్ కమిటీ సేకరించింది. కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్, ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్క, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల్లో కీలకమైన రైతు భరోసా పథకాన్ని ప్రజాక్షేత్రంలో రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా పకడ్బందీగా అమలు చేసి తీరుతుందన్నారు. అన్ని జిల్లాల్లో కేబినెట్ సబ్ కమిటీ పర్యటించి ప్రజా క్షేత్రంలో అభిప్రాయాలు సేకరించి ఈ అసెంబ్లీలో నివేదిక పొందుపరుస్తామని అన్నారు. పంట పెట్టుబడి సాయం కోసం అందించే రైతు భరోసా పేద బడుగు వర్గాలకు న్యాయం చేసేదిగా ఉండాలని విజ్ఞప్తులు వస్తున్నాయని అన్నారు. రైతు భరోసా సాయంపై ఇప్పటివరకు ఎలాంటి పరిమితులు ఖరారు కాలేదని, గ్రామం యూనిట్‌గా తీసుకోవాలని ఎక్కువ మంది రైతులు సూచిస్తున్నారని పేర్కొన్నారు. పోడు రైతులకు సర్కారు సాయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వం అందించే పంట సాయం రాష్ట్ర ఆర్థిక భారం దృష్ట్యా పెద్ద రైతులకు పక్కనపెట్టి పేద, దళిత గిరిజన రైతులకు అందించాలని పలువురు రైతులు కోరారు. మెస్రం జంగు అనే గిరిజన రైతు మాట్లాడుతూ.. వర్షాధారంపైనే తాము పంట సాగు చేస్తున్నామని, ఖర్చులు పోను ఏమీ మిగలడం లేదన్నారు. కౌలు రైతులకు కూడా సగం వంతు, మిగిలిన సగం ఆర్థిక సాయం పట్టా రైతులకు అందించాలని అన్నారు. వెనుకబడిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో పది ఎకరాల సాగు చేసే రైతులందరికీ తప్పకుండా రైతు భరోసా వర్తింపజేయాలని కోరారు.

# తెలంగాణలో టెలి కమ్యూనికేషన్స్ పెట్టుబడి

**హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 11:**

అమెరికా టెలి కమ్యూనికేషన్స్ దిగ్గజం మైక్రోలింక్ నెట్ వర్క్స్ రూ.500 కోట్ల పెట్టుబడితో తెలంగాణాలో తమ ఎలక్ట్రానిక్, ఇతర ఉత్పత్తుల కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్ కు చెందిన పిఎస్ ఆర్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో మైక్రోలింక్ పరిశ్రల క్లస్టర్ ను ప్రారంభిస్తుందని తెలిపారు. గురువారం మైక్రోలింక్ గ్లోబల్ ప్రతినిధులు, భారతీయ భాగస్వామి 'పిఎస్ ఆర్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ శ్రీరంగారావు మంత్రితో సచివాలయంలో సమావేశమయ్యారు. వచ్చే మూడేళ్లలో రూ.500 కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రానిక్, ఐటీ, నిర్మాణరంగ పరికరాలను ఉత్పత్తి చేస్తుందని శ్రీధర్ బాబు వివరించారు. రానున్న మూడేళ్లలో 700 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఇటీవల తన అమెరికా పర్యటనలో మైక్రోలింక్ నెట్ వర్క్స్ యాజమాన్యంతో జరిపిన చర్చలు ఫలవంతం అయ్యాయని అన్నారు. అనంతరం తెలంగాణాలో పెట్టుబడులకు అంగీకరించిందని శ్రీధర్ బాబు తెలిపారు. డేటా ట్రాన్స్ మిషన్, నెట్ వర్కింగ్ కేబుల్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మల్టీ లెవెల్ పార్కింగ్ మిషన్ల ఉత్పత్తిలో మైక్రోలింక్ నెట్ వర్క్స్ గ్లోబల్ లీడర్ గా ఉంది. ఇప్పుడా కంపెనీ పిఎస్ ఆర్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో పరిశ్రమలను ఏర్పాటు చేస్తుందని ఆయన తెలిపారు. తెలంగాణాలో నైపుణ్యం ఉన్న సిబ్బందికి కొరత లేదని వెల్లడించారు. సమావేశంలో పిఎస్ ఆర్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ శ్రీరంగారావు, డైరెక్టర్ నమ్రత, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధర్మరాజు చక్రవరం, మైక్రోటెక్ గ్లోబల్ ప్రతినిధులు డా. డెనిస్ మొటావా , సియాన్ ఫిలిప్స్, జో జోగ్బి, అశోక్ పెర్సోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్..

**హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్), జూలై 11:**

ఈసారి కేంద్ర బడ్జెట్‌లో సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకుని రావాలని కోరుతూ కేంద్రమంత్రి బండి సంజజ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. అయితే రెండోసారి మీరు ఎంపీ కావటం, కేంద్రంలో కూడా మంత్రిగా పదవి దక్కటంతో సిరిసిల్ల నేతన్నలకు సేవ చేసేందుకు మీకిది సరైన సమయం అని గుర్తించండి అని తెలిపారు. పదేళ్లుగా ప్రతి బడ్జెట్‌లో కేంద్రం తెలంగాణకు మొండిచెయ్యి చూపిందని గుర్తు చేశారు. అనేకసార్లు పవర్‌లూమ్ క్లస్టర్ కోసం పదిసార్లు కేంద్రానికి లేఖలు, స్వయంగా కలిసి కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ సారైనా సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తెప్పించండి. కేంద్ర మంత్రిగా మీకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోండి. ఈసారి కేంద్రబడ్జెట్‌లో సిరిసిల్లకు శుభవార్త అందేలా చూడాలని బండి సంజయ్‌ను కేటీఆర్ కోరారు. సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కృషి చేయాలని కేటీఆర్ కోరారు. కేంద్రంలో బీజేపీ సారథ్యంలోని ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున ప్రధాని మోదీని ఒప్పించి సిరిసిల్లా మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకొచ్చే బాధ్యత తీసుకోవాలన్నారు. గత పదేళ్లుగా కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది, మీరు ఈ ప్రాంత ఎంపీగా ఐదేళ్ల క్రితం ఎన్నికయ్యారు కానీ నేతన్నలకు ప్రతిసారి నిరాశానే ఎదురైందన్నారు. గతంలో పదేళ్లుగా సిరిసిల్ల ప్రాంతానికి మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకొచ్చేందుకు తాను ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ కేంద్రం నుంచి సరైన స్పందన రాలేదన్నారు. సుమారు పదిసార్లు కేంద్రంలో స్మృతి ఇరానీ, అరుణ్ జైట్లీ వంటి అనేక మంది మంత్రులను నేను స్వయంగా కలిసినా దక్కింది శూన్యం అన్నారు. బండి సంజయ్‌ను కూడా ఎన్నోసార్లు ఈ అంశంలో సహకారం అందించాలని కోరినప్పటికీ మీరు పట్టించుకోలేదన్నారు. ఈ సారి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న ఈ బ్జడెట్‌లో సిరిసిల్ల ప్రాంతానికి మెగా పవర్ లూమ్ కస్టర్‌ను ప్రకటించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సిరిసిల్లలో మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు మొదలయ్యాయని, ఉపాధి లేక ఇక్కడి కార్మికులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న సంగతి మీరు గుర్తించండన్నారు. గత ప్రభుత్వం నేతన్నల కోసం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ సర్కారు పాతరేయడంతో చేనేత రంగం మరోసారి పదేళ్ల తర్వతా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. సిరిసిల్ల నేతన్నలను ఆదుకోవాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అనేక సార్లు కోరినా, ప్రభుత్వం పట్టించుకోవటం లేదని కేటీఅర్ ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులు కష్టాల్లో ఉన్న ఈ కీలక సమయంలో వారిని ఆదుకునే మంచి అవకాశం ఇప్పుడు కేంద్రం చేతుల్లో ఉందన్నారు. సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేస్తే ఇక్కడి నేతన్నల కష్టాలు కొంత మేరకు తీరుతాయని, చేతినిండా పని దొరికి మళ్లీ ఆత్మహత్యలు లేని సిరిసిల్లను చూసే అవకాశం ఉంటుందన్నారు. క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన నైపుణ్యం కలిగిన కార్మికులు, వనరులు ఈ ప్రాంతంలో పుష్కలంగా ఉన్నాయని, నేతన్నలు, చేనేతలను ఆదుకోవటానికి గత పదేళ్లుగా కేంద్రం నుంచి ఎలాంటి సాయం అందకపోవటం దురదృష్టకరం, భాదకరమన్నారు. వనరులు లేని రాష్ట్రాలకు సైతం కేంద్రం అనేకరకాల ప్రాజెక్టులను మళ్లిస్తున్నందున, అన్నీ సానుకూలాంశాలున్న సిరిసిల్లాకు మేలు జరిగే దిశగా బండి సంజయ్ చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి బ్జడెట్‌కు ముందుకు ఈ అంశంలో కేంద్రానికి విజ్ఞప్తి చేసేవారమన్నారు. ఈ బ్జడెట్ పెట్టే నాటికే ఆర్థిక మంత్రిత్వ శాఖా మంత్రిని కలిసి సిరిసిల్ల మెగా పవర్ లూమ్ క్లస్టర్ ప్రాధన్యతను, దాని వల్ల జరిగే లబ్దిని, వారి దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కోరారు. తెలంగాణ ప్రజలు ఎక్కువ మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్న మీ మాటలు నమ్మి మిమ్మల్ని గెలిపించారని, కానీ గత ఐదేళ్లలో కరీంనగర్‌కు గానీ సిరిసిల్ల నేతన్నలకుగానీ బండి సంజయ్ పదవీకాలంలో జరిగిన ప్రయోజనం ఏమీ లేదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ఎంపీలు మాత్రం తమ ప్రాంత ప్రయోజనాల కోసం కేంద్రంతో పోరాటం చేసి తమ ప్రాంతాలకు నిధులను, పరిశ్రమలను తరలించుకుపోతున్నారని, కనుక తెలంగాణ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని మన ప్రాంత ప్రయోజనాల కోసం కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ బడ్జెట్ లో కచ్చితంగా సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్ ప్రకటన చేయిస్తారని భావిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు.









# బమ్మెర పోతన సమాధిని సందర్శించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



పాలకుర్తి, (నేటి ఫోకస్ న్యూస్)-జూలై 11:

బమ్మెర పోతన ఆడిటోరియం, వల్మిడి దేవాలయ పనులు త్వరగా పూర్తి చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జనగామ జిల్లా పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామంలో బమ్మెర పోతన సమాధిని మరియు వల్మిడి దేవాలయమును అధికారులతో సందర్శించారు. అనంతరం పాలకుర్తి మండలం,బమ్మెర గ్రామంలో పాలకుర్తి నియోజకవర్గ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం బమ్మెర పోతన సమాధిని జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా, అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్ లతో కలిసి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే పాలకుర్తి,వల్మిడి దేవాలయాల పనులను,బమ్మెర పోతన ఆడిటోరియం పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్%డ%బి డిఈ అల్లంనేని నాగేందర్ రావు,ఆర్డిఓడిఎస్ వెంకన్న,ఏసీపీ నర్సయ్య,సీఐ మహేందర్ రెడ్డి,ఎస్సై సాయి ప్రసన్న కుమార్,తదితరులు పాల్గొన్నారు.



## ఓయూలో జర్నలిస్టులపై దాడిని ఖండిస్తూ టీయుడబ్ల్యూజే (ఐ.జే.యు) ఆధ్వర్యంలో నిరసన

నల్లగొండ/(నేటి ఫోకస్ న్యూస్)-జూలై 11:

నిన్న హైదరబాద్ ఓయూ లో న్యూస్ కవరేజ్ కి వెళ్ళిన న్యూస్ రిపోర్టర్స్, వీడియో జర్నలిస్టుల పై పోలీస్ ల దాడినీ ఖండిస్తూ. ఈ రోజు నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్ లో ఉదయం 11 గంటలకు జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో టీ.యు.డబ్ల్యూ.జే (ఐ.జే.యు) నల్గొండ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిస్టులపై జరిగిన పోలీసుల చర్యలు సరైనది కాదని, ఇలాంటి చర్యలకు పాల్పడిన పోలీసులను వెం టనే సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూసుకోవాల అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పులిమామిడి మహేందర్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు దోటి శ్రీను, చిన్న పత్రికల అధ్యక్షులు పిట్టల రామకృష్ణ, టి.యు.డబ్ల్యూ.జే సహాయ కార్యదర్శి పొట్టు ముత్తు అశోక్, కక్కిరేణి రామ్మోహన్, సల్లోజు ధనుంజయ కుమార్, సహాయ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# నేడు రైతు భరోసాపై కేబినెట్ సబ్ కమిటీ అభిప్రాయ సేకరణ

- హాజరు కానున్న ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు, ఎమ్మెల్యేలు
- సమావేశాన్ని విజయవంతం చేయాలని చిన్నారెడ్డి, మేఘారెడ్డి పిలుపు





వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:

రైతు భరోసాపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ నేడు వనపర్తి జిల్లా కేంద్రంలోని ఐడిఓసి సమీక్ష సమావేశ మందిరంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఐటీ కమ్యూనికేషన్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, స్థానిక శాసనసభ్యులు మేఘా రెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి, మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, జిల్లా కలెక్టర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. కాగా ఉ. 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు జరిగే అభిప్రాయ సేకరణలో జిల్లాలోని రైతులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి అభిప్రాయ సేకరణ సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి, స్థానిక శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డిలు వేరువేరుగా పిలుపునిచ్చారు.

## చంద్రబాబు గురించి జగ్గారెడ్డి, నిరంజన్ రెడ్డి, విజయశాంతి నోరు జారితే బాగోదు

- టీటీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోగుల సైదులు గౌడ్

మిర్యాలగూడ/(నేటి ఫోకస్ న్యూస్)-జూలై 11:

పూటకో పార్టీ మార్చి పదవుల కోసం కక్కుర్తి పడే మీరు నిరంతరం ప్రజల కోసం పాటుపడే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌరవ శ్రీ నారా చంద్రబాబునాయుడు గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోగుల సైదులు గౌడ్ హెచ్చరించారు. పది సంవత్సరాలు కేసీఆర్ పరిపాలనలో గులాంగిరి చేసిన మీకు చంద్రబాబు పేరు వింటేనే మీకు భయమెందుకు వేస్తుందో నాకు అర్థం కావట్లేదు. అంటే దీని బట్టి అర్థమేంటి టీడీపీ అన్నా చంద్రబాబు అన్నా మీకు జంకు పుడుతుంది. జగ్గారెడ్డి నిరంజన్ రెడ్డి, విజయశాంతి కి చెప్పేది తెలుగుదేశం పార్టీ ఎక్కడో ఇటలీ నుంచి వేరే దేశం నుంచి రాలేదండి మా పార్టీ తెలుగు వాడి, పేద వాడి గుండెల నుంచి పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ పేదల కోసం, అనాడు సమాజమే దేవాలయం ప్రజలే నా దేవుళ్ళని నినాదంతో అన్న నందమూరి తారక రామారావు స్థాపించిన పార్టీ, తెలంగాణ గడ్డపై పురుడు పోసుకున్న పార్టీ మాది, మీరు అనుకున్నది వాస్తవం రానున్న రోజుల్లో తెలంగాణలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుంది. తెలుగుదేశం పార్టీని చంద్రబాబును విమర్శించినోడి పరిస్థితులు చుస్తునాం ఈరోజు తెలంగాణలో టిఆర్ఎస్ భూస్థాపితం అయిందంటే అది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల, ఉసురు, గోస, తగిలి కెసిఆర్ నామరూపం లేకుండా పోయిందు, ఆంధ్రలో జగన్ పోయిందు, మీలాగా చిల్లర రాజకీయాలు చేసే వ్యక్తిత్వం మా నాయకుడు నారా చంద్రబాబునాయుడు ది కాదు ఈ రోజు ఆయన గెలుపు నీతి, నిజాయితీకి, మంచితనానికి, మారుపేరు. ఇకనైనా రాజకీయ నైతిక విలువలు తెలుసుకొని మర్యాదగా మెలగండి, లేదంటే టిడిపి కార్యకర్తలు తిరగబడితే మీరు అడ్రస్ లేకుండా పోతారన్నారు.



## బీఆర్ఎస్‌కు షాక్

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్):

బీఆర్ఎస్ పార్టీ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలోకి వలస జోరు కొనసాగుతుంది. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.. శుక్రవారం కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఆయనతో పాటు ఇద్దరు మున్సిపల్ చైర్మన్లు సైతం పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకోనున్నారు. అయితే ఈ ఏడాది ఏప్రిల్‌లో సీఎం నివాసంలో రేవంత్ రెడ్డితో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ భేటీ అయ్యారు. ఈ సందర్బంగా ప్రకాశ్ గౌడ్ సైతం కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచరం. ఆ క్రమంలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ అయ్యారు. ఈ భేటీ అనంతరం ప్రకాష్ గౌడ్ మనసు మార్చుకున్నట్లు చర్చ సైతం సాగింది.

## న్యాయవాదులపై రోజురోజుకు పెరుగుతున్న దాడులపై ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలి

తొర్రూర్, (నేటి ఫోకస్ న్యూస్)-జూలై 11:

ఇటీవల వరంగల్ భద్రాచలంలో న్యాయవాదులపై జరిగిన దాడిని మరువకముందే మరొక ఉదాంతం వెలుగులోకి వచ్చింది. పూర్తి వివరాల్లోకి వెళ్ళగా నిన్న సిద్దిపేటలో అడ్వకేట్ రవికుమార్ పై చట్ట విరుద్ధంగా జరిగిన పోలీసుల దాడి వారు ప్రదర్శించిన తీరు తో న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని తొర్రూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఈ సంఘటనపై తొర్రూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఖండిస్తూ తమ కోర్టు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అసోసియేషన్ బాధ్యులు మాట్లాడుతూ.. న్యాయవాదులపై రోజురోజుకు పెరుగుతున్న దాడులపై ప్రభుత్వం స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టి న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని అమలుచేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘటనలపై ప్రభుత్వం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కల్వకోలను ప్రవీణ్ రాజ్, జనరల్ సెక్రటరీ ఆర్కే ఘణపురం, ట్రెజరర్ సైదులు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ నాగరాజు, మాదగాని, న్యాయవాదులు బండపల్లి వెంకన్న, వల్లపు మహేష్, పొడకంటి యాకాంబ్రం, వల్లపు మధుసూదన్, రఘురాం రెడ్డి, వల్లపు ఐలోని, బొల్లం వెంకటేష్, నగేష్ దారావత్ లింగాల శ్రీను, ఎల్లేష్, బాషి పంగు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## నేటి బాలలే రేపటి పౌరులు

- అంగన్వాడి సెంటర్ చిన్నారులకు టి.ఎన్ అండ
- ఫ్యాన్, ట్యూబ్ లైట్లు, ఫ్లోర్ మ్యాట్ పంపిణీ చేసిన టిఎన్.శ్రీనివాస్

ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూలై 11:

నేటి బాలలే రేపటి పౌరులని, అంగన్వాడి విద్యార్థుల సమస్యలు విని చలించిపోయి, అంగన్వాడి చిన్నారులకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తు, మరోసారి మానవత దృక్పథం చాటుకున్న, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టి.ఎన్ శ్రీనివాస్. గురువారం కంటోన్మెంట్ నియోజకవర్గం రెండో వార్డు కట్ట మైసమ్మ అంగన్వాడి పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్, ట్యూబ్ లైట్లు, ఫ్లోర్ మ్యాట్లను పంపిణీ చేయడం జరిగిందని, టి.ఎన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంగన్వాడి సెంటర్ కు ఫ్యాన్, ట్యూబ్లైట్లు, ఫ్లోర్ మ్యాట్స్, లేక విద్యార్థులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఇట్టి సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని, అంగన్వాడి చిన్నారులను దృష్టిలో పెట్టుకొని, అంగన్వాడి సెంటర్ కు ఫ్యాన్, ట్యూబ్ లైట్స్, ఫ్లోర్ మ్యాట్ లను అంగన్వాడి సెంటర్ కు ఇచ్చినట్టు టీ.ఎన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మండలం అంగన్వాడి సూపర్ డెంట్, అంగన్వాడి టీచర్ షీలా బాయ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుమార్ ముదిరాజ్, శ్యామ్ రెడ్డి, కుమార్ గౌడ్, అయ్యాం, సుకన్య, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సిర్గాపూర్ రోడ్డుపై ప్రమాదకరంగా గుంత

- నడి రోడ్డుపై ఉన్న కల్వర్ట్ గుంత పట్టించుకోని అధికారులు



సిర్గాపూర్, (ఫోకస్ న్యూస్)-జులై 11:

సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల కేంద్రంలో పండరి-ఛాటీ స్టాల్ ముందర ఊరు నడి బొడ్డున నల్లవాగు (సుల్తానాబాద్) రోడ్డు మార్గంలో వెళ్లే రహదారిపై కల్వర్ట్ కూలి గుంతగా ఏర్పడి, అరి గడ్డితో కప్పుకుపోయింది. ఇది చూసి కూడా పట్టించుకునే నాథుడే లేదు. నాలుగు రోజుల కిందట ఓ జంట చంటి బాలుడితో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుంత గమనించక అందులో పడి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదకరంగా మారిన ఉన్న గుంత గత పాలకుల హయాంలో ఉన్న పట్టించుకోని వైనం. ఈ మార్గం గుండా వందల సంఖ్యలో వాహనాలు రాక పోకలు సాగిస్తుంటారు. ఇకముందు ముందు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేతున్నారు.

## ఎమ్మెల్యే వంశీకృష్ణకి మంత్రి పదవి ఇవ్వాలి

- ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు సంతోష్

అచ్చంపేట, (నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి భరత్)-జూలై 11:



గత 30 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీని బతికిస్తూ ఎన్నో ఆఫర్లు వచ్చిన కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ జిల్లా అధ్యక్షుడిగా జిల్లాలో ఏ నాయకుడు లేనప్పుడు పార్టీని బతికించడం అనేక కార్యక్రమాలు తీసుకెళ్తూ ముందుకు వెళ్లినటువంటి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ కి మంత్రి పదవి ఇవ్వాలని నాగర్ కర్నూల్ శాఖ తరపున మేము మాట్లాడుతున్నాము కాంగ్రెస్ కార్యకర్తలు బతకాలన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉండాలని నికార్సైన కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ వంశీకృష్ణ గకి మంత్రి పదవి ఇవ్వాలని కోరుతున్నాము.



## చిన్నారులకు నోట్ బుక్స్,పెన్నులు పంపిణీ

అచ్చంపేట, (నీటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి)-ఆర్.భరత్ జూలై 11:

నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట మండలంలోని కన్య తండాలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు మండల ప్రభుత్వ ప్రజా పరిషత్ పాఠశాలలో చిన్నారి విద్యార్థులకు నోట్ బుక్స్ మరియు పెన్నులను డొనేట్ చేసిన గిరిజన యువ నాయకుడు అచ్చంపేట మండల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చందర్ నాయక్ ఈ సందర్భంగా చందర్ నాయక్ మాట్లాడుతూ చిన్నారులకు భవిష్యత్తులో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఇప్పటి నుంచే చదవాలని సూచించడంతోపాటు ప్రతిరోజు పాఠశాలకు వచ్చే విధంగా అలవాటు చేసుకోవాలని తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామ నాయకులు పాల్గొనడం జరిగినది.

## పొజిషన్‌లో ఉన్నవారికి కాలు మంజూరు చేయాలి

- సిపిఐ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా తాసిల్దార్‌కు వినతి

నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి, (స్టేట్ కోఆర్డినేటర్)-జులై 11:

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో పొజిషన్లో ఉన్నవారికి పట్టాలు మంజూరు చేయాలని స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో పట్టణ కార్యదర్శి వినోద వారి సభ్యులు గురువారం నాడుధర్నా నిర్వహించి అనంతరం తాసిల్దార్ సరస్వతికి వినతి పత్రం అందజేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ఆరు సంవత్సరాల నుండి సదాశివపేట పట్టణంలోని సర్వే నెంబర్ 260 సిద్దాపూర్ కాలనీలో పూరిపాకలు వేసుకొని అక్కడే నివాసం ఉంటున్న అర్హులైన నిరుపేదలకు పొజిషన్ పట్టాలు మంజూరీ చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక తహసిదార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం ఎన్నో సార్లుచేయడం జరిగిందని. పట్టణంలోనే నిరుపేదలు.అద్దెలు చెల్లించలేక గత ఆరు ఏళ్ళ క్రితం పురిపాకలు వేసుకొని ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకున్నా గడుపుతున్నారని.గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పట్టాలు మంజురి చేయాలని అనేక దఫాలుగా అప్పటి ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది అధికారం చేపట్టి దాదాపు 6 నెలలు పూర్తి అవుతుంది ఇప్పటికైనా ముఖ్య మంత్రిరేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల గురించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని పట్టాలు ఇచ్చి మాట నిలబెట్టుకోవాలని సిపిఐ పార్టీ వారికి వారికి విజ్ఞప్తి చేస్తుంది ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సభ్యులు ఏం తాజుద్దీన్ షఫీ రహేమన్ . ముంగి రమేష్. శంకరప్ప. దుర్గయ్య. మాబూబ్ అలి. ఉమేష్ .పాండు. ముస్తఫా అనుసుజా బుజ్జమ్మ లక్ష్మి తస్లీమ్ రాధా. జ్యోతి శంకరమ్మ పాల్గొన్నారు.




## జీవో 317పై కేబినేట్ సబ్‌కమిటీ భేటీ

- భార్యాభర్తల బదిలీలపై సానుకూల నిర్ణయం

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 11:

జీవో 317పై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. సమావేశంలో మం త్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను సబ్ కమిటీ ప్రకటించింది. సమావేశం లో స్పౌజ్, మెడికల్, మ్యూచువల్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల భార్య, భర్త చేసుకున్న దరఖాస్తులపై కమిటీ సానుకూల నిర్ణయం తీసు కుంది. కేబినెట్ సబ్ కమిటీకి చేసుకున్న దరఖా స్తులను సంబంధిత శాఖల అధిపతులకు పంపించాల్సిందిగా జీఏడీ అధికారులకు సబ్ కమిటీ ఆదేశించింది. మిగతా దరఖా స్తులను వివిధ శాఖలకు పంపి వాటిని పరిశీలన చేసిన అనం తరం తిరిగి కేబినెట్ సబ్ కమిటీ దృష్టి కి తీసుకురావాలని కమిటీ సమావేశంలో నిర్ణయించింది. కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్ రావు, రిటైర్డ్ ఐఏఎస్ శివశంకర్, జీఏడీ అధికారులు పాల్గొన్నారు.

నేటి ఫోకస్ న్యూస్
శుక్రవారం 12, జూలై 2024

# గేమ్‌చేంజర్‌తో నా కల నెరవేరింది

## – డైరెక్టర్ శంకర్ ఆసక్తికర ప్రకటన



రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిస్తున్న చిత్రం 'గేమ్ ఛేంజర్ సినిమా గురించి దర్శకుడు శంకర్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన మరో చిత్రం 'భారతీయుడు 2' ప్రచారంలో భాగంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. 'నేను తెరకెక్కించిన తమిళ చిత్రాలకు తెలుగులోనూ మంచి ఆదరణ దక్కింది. అందుకే నేరుగా తెలుగులోనే ఓ సినిమా తీయాలని ఎప్పుడూ అనుకుంటూ ఉండేవాణ్ని. ఆ మేరకు చేసిన కొన్ని ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఎట్టకేలకు 'గేమ్ ఛేంజర్'తో నా కల నెరవేరుతోంది. కార్తీక్ సుబ్బరాజు కథతో దీన్ని రూపొందిస్తున్నా. ఇది పూర్తిస్థాయి యాక్షన్ చిత్రం. నా నుంచి ఇలాంటి మాస్ సినిమా వచ్చి చాలా కాలమైంది' అని పేర్కొన్నారు. సంబంధిత విజువల్స్‌ను రామ్‌చరణ్ ఫ్యాన్స్ నెట్టింట పోస్ట్ చేస్తూ ఆనందం వ్యక్తంచేస్తున్నారు. 'గేమ్ ఛేంజర్' మాస్ ఫిల్మ్ అంటూ ఎమోజీలు జత చేస్తున్నారు. ఈ సినిమాలో చరణ్ ద్విపాత్రాభినయం చేశారని సమాచారం. కియారా అద్వాణి హీరోయిన్. అంజలి, శ్రీకాంత్, ఎస్‌జే సూర్య, నవీన్ చంద్ర కీలక పాత్రలు పోషించారు. హీరో పాత్రకు సంబంధించిన చిత్రీకరణ ఇటీవల పూర్తయింది. దాదాపు 10 రోజుల షూటింగ్ మిగిలిఉందని శంకర్ ఇటీవల ప్రెస్‌మీట్‌లో చెప్పారు. ఫైనల్ ఎడిటింగ్ అయ్యాక రిలీజ్ డేట్ ప్రకటిస్తామని తెలిపారు.



# రిలీజ్‌కు ముందే పుష్ప-2 సంచలనాలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్ పుష్ప ది రూల్ సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఆగస్టులో రావాల్సిన ఈ చిత్రాన్ని వాయిదా వేస్తూ.. డిసెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు తెలియజేశారు. కాగా ఇప్పుడు పుష్ప 2 హిందీ వెర్షన్ నాన్ థ్రియాట్రికల్ రైట్స్‌కు సంబంధించిన వార్త ఒకటి హాట్ టాపిక్‌గా మారింది. తమిళ నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా ఈ మూవీ నాన్ థ్రియాట్రికల్ రైట్స్ రూ.260 కోట్ల భారీ మొత్తం పలికాయి. సింగిల్‌గా లేదా మల్టీ లాంగ్వేజ్ పరంగా చూసుకున్నా నాన్ థ్రియాట్రికల్ రైట్స్ విషయంలో ఈ ఫిగర్ ఇండియన్ సినీ చరిత్రలోనే అతి పెద్దదని చెప్పారు. ఇప్పుడీ కామెంట్స్ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నాయి. ఈ మూవీకి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఇప్పటికే మ్యూజిక్ ప్రమోషన్స్ షురూ చేసిన బన్నీ టీం.. పుష్ప పుష్ప సాంగ్ లాంచ్ చేయగా నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది. మరోవైపు రెండో సాంగ్ సూసేకి తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ, బెంగాలీ భాషల్లో నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్‌తో పాటు వేల సంఖ్యలో రీల్స్ నెట్టింట సందడి చేస్తున్నారు. ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ నటిస్తున్నారు.




# వచ్చే నెలలో వస్తోన్న విజయ్ తుఫాన్



విజయ్ ఆంటోనీ నటిస్తున్న తాజా చిత్రం 'తుఫాన్'. ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్ బ్యానర్ పై కమల్ బోరా, డి.లలితా, బి. ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. పొయెటిక్ యాక్షన్ ఎంటర్ టైనర్ జానర్ లో ఈ సినిమాను రూపొందిస్తున్నారు దర్శకుడు విజయ్ మిల్టన్. ఆగస్టు 2న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ఈ రోజు ప్రకటించారు. 'తనను చిన్న చూపు చూసే సమాజం భవితను మార్చిన ఓ వ్యక్తి కథ ఇది. ఓ దీవి నేపథ్యంగా సాగే ఈ సినిమా షూటింగ్‌ను అండమాన్, డయ్యూ డామన్ లలో చిత్రీకరించాం. ఇప్పటికే రిలీజ్ చేసిన పాటలకు, ట్రైలర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. సినిమాకు కూడా ఇదే పాజిటివ్ రెస్పాన్స్ వస్తుందని నమ్ముతున్నాం' అని మేకర్స్ అన్నారు. విజయ్ ఆంటోనీ, శరత్ కుమార్, సత్యరాజ్, డాలీ ధనుంజయ, మేఘా ఆకాష్, మురళీ శర్మ, పృథ్వీ అంబర్, శరణ్య పొన్వన్నన్, తలైవాసల్ విజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి అచ్చు రాజమణి, విజయ్ ఆంటోనీ.

# తంగలాన్ ట్రైలర్ విడుదల

## ఆసక్తిరేకెత్తిస్తున్న పోరాటాలు

విక్రమ్ కథానాయకుడిగా పా.రంజిత్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న పీరియాడిక్ యాక్షన్ చిత్రం 'తంగలాన్'. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. మాళవిక మోహనన్, పార్వతీ తిరువోతు, పశుపతి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే బుధవారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో బ్రిటిష్ పాలనలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందించిన సంగతి తెలిసిందే. దీని కోసం అప్పటి వాతావరణాన్ని తలపించేలా ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించారు పా.రంజిత్. దాన్ని ట్రైలర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. కోలార్ గనుల్లోని బంగారాన్ని వెలికి తీసేందుకు బ్రిటిష్ అధికారులు స్థానిక గిరిజనుల్ని పనిలో పెట్టుకోవడం.. అందులో ఓ గిరిజన తెగ నాయకుడిగా విక్రమ్ విభిన్నమైన లుక్‌లో కనిపించడం.. బంగారాన్ని వెలికి తీసే క్రమంలో రెండు తెగల మధ్య పోరు మొదలవడం.. ఇలా ఆద్యంతం ఆసక్తిరేకెత్తిస్తూ సాగిందీ ప్రచార చిత్రం. ఇందులో విల్లు, బరిసెలు, ఈటెలతో చేసిన యాక్షన్ సీక్వెన్స్‌లు, ఆఖర్లో బ్లాక్ పాంథర్‌తో విక్రమ్ చేసిన్గ ట్ అన్నీ అలరించాయి. 'చావుని ఎదురించే వాళ్లకు మాత్రమే ఇక్కడ జీవితం' అంటూ ట్రైలర్ ఆఖర్లో విక్రమ్ చెప్పిన డైలాగ్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమా ఆగస్టులో థియేటర్లలోకి రానున్నట్లు ప్రచారం వినిపిస్తోంది.

